## క్లుప్తంగా

### సీఎంను కలిసిన తరుణ్‌రెడ్డి



సీఎంని కలిసిన తరుణ్‌రెడ్డి

**పూతలపట్టు:** మేము సిద్ధం–బస్సు యాత్రలో భాగంగా పూతలపట్టుకు విచ్చేసిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని వైఎస్సార్‌సీపీ జిల్లా యువ జన విభాగ కార్యదర్శి తరుణ్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. వీరితో పాటు నియోజకవర్గంలోని ముఖ్య నాయకులు పుష్పగుచ్ఛం అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పెనుగొండ పరిశీలకులు బాబురెడ్డి, జగదీశ్వర్‌రెడ్డి, పార్టీ కన్వీనర్ శ్రీకాంత్‌రెడ్డి, పరమేశ్వర్‌రెడ్డి, సుధాకర్ రెడ్డి పాల్గొన్నారు.

### బైక్ ర్యాలీలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి



బైక్ ర్యాలీలో సభకు చేరుకున్న వైఎస్సార్‌సీపీ అభ్యర్థి డాక్టర్ సునీల్‌కుమార్

**ఐరాల:** సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి బహిరంగ సభకు ఐరాల మండలంలోని వైఎస్సార్‌సీపీ శ్రేణులు చేపట్టిన బైక్ భారీ ర్యాలీలో పూతలపట్టు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి డాక్టర్ సునీల్‌కుమార్ పాల్గొన్నారు. పార్టీ శ్రేణులు, యువకులు చేపట్టిన బైక్ ర్యాలీలో డాక్టర్ సునీల్‌కుమార్ ఉత్సాహంగా పాల్గొని సభాస్థలికి చేరుకొన్నారు.

### గోవిందరెడ్డిపల్లెలో ఫ్యామిలీ డాక్టర్



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ ప్రవీణ్‌కుమార్

**ఐరాల:** మండలంలోని గోవిందరెడ్డిపల్లెలో బుధవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. మండల వైద్యాధికారి డాక్టర్ ప్రవీణ్ కుమార్ 68 మంది రోగులకు వైద్య పరీక్షలు చేయించి సూచనలు, సలహాలిచ్చారు. గర్భవతులు, బాలింతలు, బీపీ, సుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు చేయించి మందులు అందజేశారు. గర్భవతులు మంచి పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. గర్భవతులకు ఆరోగ్య సూత్రాలను వివరించారు. కార్యక్రమంలో వైద్య బృందం, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

### 9న ఉగాది వేడుకలు

**కాణిపాకం (చిత్తూరు రూరల్):** కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయక స్వామి ఆలయంలో ఈనెల 9వ తేదీన ఉగాది వేడుకలను నిర్వహిస్తున్నట్లు ఈఓ వెంకటేశు తెలిపారు. ఉదయం స్వామికి అభిషేకం ఉంటుందన్నారు. ఉదయం 10.30 నుంచి 11.30 గంటల వరకు పంచాంగ శ్రవణం జరుగుతుందన్నారు. ఉభయదారులు, భక్తులు పాల్గొనాలని ఆయన కోరారు.

### మేమంతా సిద్ధంకు తరలిన జనం

**చిత్తూరు కార్పొరేషన్:** పూతలపట్టులో బుధవారం నిర్వహించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సభకు నగరం నుంచి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు తరలివెళ్లారు. సంక్షేమ పథకాలు అందించిన జగనన్నను కనులారా చూసేందుకు ఆనందంగా తరలి వెళుతున్నామని స్థానికులు వివరించారు.

### సభకు భారీగా జనం

**పూతలపట్టు:** మండల కేంద్రంలో బుధవారం జరిగిన మేమంతా సిద్ధం సభకు నియోజకవర్గం నుంచి పెద్ద ఎత్తున నాయకులు, కార్యకర్తలు తరలివచ్చారు. నియోజవర్గంలోని ఐదు మండలాల నుంచి వేలాది వాహనాల్లో భారీగా సభాస్థలికి చేరుకున్నారు. సభా వేదిక ప్రాంగణం నిండుకుని జనం రోడ్డుపైకి వచ్చేశారు. దీంతో రోడ్డంతా సిద్ధం సభ జన కళను సంతరించుకుంది. బస్సుయాత్ర దారి పొడవునా జనం జగనన్నను చూసేందుకు క్యూకట్టారు. యాత్రకు వచ్చిన జనానికి ఎలాంటి ఇబ్బంది లేకుండా నాయకులు, కార్యకర్తలు ఏర్పాట్లు పకడ్బందీగా చేశారు.

### రోబోటెక్ శస్త్రచికిత్సలపై వర్క్ షాప్

**గుడుపల్లె:** పీఈఎస్ ఆసుపత్రిలో రోబోటెక్ శస్త్ర చికిత్సలపై అవగాహనకు బుధవారం వర్క్‌షాప్‌ను కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ హెచ్‌ఆర్ క్రిష్టారావు ప్రారంభించారు. బెంగళూరుకు చెందిన ప్రముఖ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్ డాక్టర్ శశికిరణ్ జీర్ణాశయాంతర రోబోటెక్ శస్త్ర చికిత్సల గురించి వివరించారు. కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ సుబ్రమణ్యం, చిదంబర రావు, మోహన్, వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.



సభకు వచ్చిన జనానికి అభివాదం చేస్తున్న సీఎం వైఎస్ జగన్



అభిమాన నాయకుడిని చూసిన ఆనందంలో..

# మీ అభిమానం చల్లంగుండా..!



సంక్షేమ ప్రదాతకు స్వాగతం పలికేందుకు నిరీక్షిస్తున్న ప్రజలు



జయహో నాయకా: జననేతకు జయజయధ్వానాలతో స్వాగతం పలుకుతున్న అభిమానులు

- సీఎం బహిరంగ సభ సూపర్ సక్సెస్
- తరలి వచ్చిన పార్టీ శ్రేణులు, అభిమానులు
- మండుటెండను సైతం లెక్కచేయని జనం

**పూతలపట్టు/చిత్తూరు అర్బన్/ రూరల్/ కలెక్టరేట్:** మిట్ట మధ్యాహ్నం మండుతున్న ఎండను సైతం లెక్క చేయకుండా అభిమాన నేతను కళ్లారా చూసేందుకు గంటల తరబడి నిరీక్షించారు. మండల కేంద్రంలో నిర్వహించి సీఎం సభ సూపర్ సక్సెస్ అయింది. రోడ్డుకిరువైపులా నిల్చున్న జనం జగనన్న కనిపించగానే పూలవర్షం కురిపించారు. రోడ్ల వెంబడి జన జాతర తలపించింది. పిల్లల నుంచి వృద్ధుల వరకు పాలకల సంతగేటు నుంచి క్యూకట్టారు. కొందరు ఇంటి మిద్దెలపై నుంచి ఎదురుచూశారు. నూతనంగా నిర్మించిన ఆర్చిపైకి ఎగబడ్డారు.

**జనసంద్రంగా మారిన పూతలపట్టు**

మేము సిద్ధం–బస్సుయాత్రలో భాగంగా బుధవారం పూతలపట్టు మండలానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విచ్చేశారు. మొదట అభిమానులు, నాయకులు పాటూరు వద్ద ఘన స్వాగతం పలికారు. అనంతరం బైకుల ద్వారా బస్సు వెంటే యాత్రను కొనసాగించారు. మధ్యాహ్నం తేనేపల్లి టోల్‌ప్లాజా వద్ద భోజనం ముగించుకొని సాయంత్రం గోపాలపురం వద్ద ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభకు హాజరయ్యారు. జేసీబీల ద్వారా పైకెక్కిన పార్టీ కార్యకర్తలు వైఎస్.జగన్‌పై పూల వర్షం కురిపించారు. తలపులపల్లె వద్ద ప్రజలకు అభివాదం చేసి కాసేపు విశ్రాంతి తీసుకున్నారు. రంగంపేట క్రాస్‌లో పెద్ద ఎత్తున ప్రజలు ముఖ్యమంత్రికి స్వాగతం పలికారు. ఫ్లై ఓవర్ కింద పార్టీ కార్యకర్తలతో కిక్కిరిసిపోయింది. అయిదు నిముషాల పాటు కార్యకర్తలకు ఆప్యాయంగా అభివాదం చేసిన వైఎస్.జగన్, ఆపై గోపాలపురం బస్టాపు నుంచి సభకు బయల్దేరారు. బహిరంగ సభ ముగించుకున్న ముఖ్యమంత్రి రంగంపేట క్రాస్, పి.కొత్తకోట కూడలి మీదుగా చంద్రగిరి నియోజకవర్గంకు చేరుకున్నారు. సభ విజయవంతం కావడంతో పార్టీ శ్రేణుల్లో కొత్త జోష్ వచ్చింది.

ఈ కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ ధనంజయ రెడ్డి, ముఖ్యనాయకులు మోహన్‌రెడ్డి, కుమార్‌రాజ, జగదీశ్వర్‌రెడ్డి, రాజారత్నంరెడ్డి, ప్రకాష్‌రెడ్డి, శైలజా చరణ్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, రామచంద్రా రెడ్డి, శిరీష్‌రెడ్డి, అమరావతి, సోమశేఖర్, చంద్రశేఖర్ రెడ్డి, పూజారి మోహన్‌రెడ్డి, కాణిపాక ఆలయ చైర్మన్ మోహన్‌రెడ్డి, శాంతిసాగర్‌రెడ్డి, చిన్నారెడ్డి, ఎంపీపీలు మోహన్, కుమారి, సురేష్ బాబు, గీతా రెడ్డి, జెడ్పీటీసీలు సుచిత్ర, దేవిక, భారతి, తవణంపల్లె నాయకులు ప్రతాప్‌రెడ్డి, హరిరెడ్డి, హరికృష్ణారెడ్డి, కిషోర్‌రెడ్డి, రమణారెడ్డి, ఉమామహేశ్వరరెడ్డి, పూర్ణచంద్రారెడ్డి, సురేష్‌బాబురెడ్డి వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, ముఖ్యనాయకులు పాల్గొన్నారు.



అభిమాన నాయకుడిని చూసేందుకు టవరెక్కిన యువకులు







బస్సు పైకెక్కి అభిమాన నాయకుడిని సెల్ కెమెరాల్లో బంధిస్తున్న యువకులు, విద్యా ప్రదాతను చూసిన ఆనందంలో యువతుల ఆనంద హేల, రాజన్న బిడ్డ రాక కోసం జెండాలు చేతపట్టి రోడ్డుకిరువైపులా నిరీక్షిస్తున్న యువత

# బాబూ.. మా ఉసురు తగులుతుంది

- వలంటీర్లను చంద్రబాబు అడ్డుకోవడంపై ఆగ్రహం
- పింఛనుదారుల పడిగాపులు
- ఎండ తీవ్రతకు సచివాలయాలకు వెళ్లలేక అవస్థలు



నగరంలోని ఓబయ్యగారి పల్లె సచివాలయానికి స్కూటర్‌లో వచ్చిన వృద్ధులు



సంతపేట సచివాలయానికి ఆటోలో వచ్చిన వృద్ధురాలు కాంతమ్మ

**చిత్తూరు అగ్రికల్చర్/చిత్తూరు కార్పొరేషన్:** ప్రతి నెలా ఒకటో తేదీన తెల్లవారకముందే ఇళ్లవద్దకే వలంటీర్లు వచ్చి పింఛను మొత్తాలను చేతి కందించేవారు... అయితే ఇప్పుడు చంద్రబాబు కక్షకట్టి అవకాశం చూసి దెబ్బకొట్టారు. వలంటీర్లు పింఛన్లు అందివ్వకుండా కుట్ర చేశారు. దెబ్బకు వలంటీర్లు ఇంటికి రావడం లేదు. ఎక్కడో ఉన్న సచివాలయం వద్దకు వెళ్లి పడిగాపులు కాసి పింఛను మొత్తాలను తీసుకోవాలి. మాలాంటి వారి ఉసురు చంద్రబాబుకు తగులుతుంది. రాక్షసుడిగా మారిన చంద్రబాబు రాజకీయాలకు గుణపాఠం చెబుతామని సామాజిక పింఛను దారులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

చిత్తూరు నగర పరిధిలో పింఛన్ల పంపిణీ బుధవారం మధ్యాహ్నం నుంచి ప్రారంభమవడంతో లబ్ధిదారులకు పడిగాపులు తప్పలేదు. ఎండ తీవ్రతకు సచివాలయాలకు వెళ్లలేక వృద్ధులు అవస్థలు పడ్డారు. నగర పరిధిలో మొత్తం 50 డివిజన్ల పరిధిలో సచివాలయాల వద్ద పింఛను మొత్తాల పంపిణీని సిబ్బంది చేపట్టారు. మొత్తం 16,690 మంది లబ్ధిదారులకు ప్రభుత్వం పింఛన్ మొత్తాలను మంజూరు చేసింది. దీంతో బుధవారం సాయంత్రానికి మొత్తంలో 71 శాతం పంపిణీని పూర్తి చేశారు. అయితే వృద్ధులు, మహిళలకు ఎండ తీవ్రత వల్ల ఇబ్బందులు తప్పలేదు. గత ఐదేళ్లుగా ప్రతి నెలా పండుగ వచ్చినా, ఏదైనా సెలవులు వచ్చినా ఒకటో తేదీనే ఉదయాన్నే వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులు ఇళ్లవద్దనే పింఛను మొత్తాలను వలంటీర్లు అందించేవారు. దీంతో వారు సకాలంలో అవసరాలు తీర్చుకోవడం, మందులు కొనుగోలు చేసుకోవడం లాంటి వెసులుబాటు ఉండేది. అయితే ఈ నెల పింఛన్ల పంపిణీకి వలంటీర్ల వ్యవస్థను పక్కన పెట్టడంతో లబ్ధిదారులకు అవస్థలు తప్పలేదు. పింఛను మొత్తంపైనే ఆధారపడి జీవనం సాగించే అభాగ్యులు ఎందరో ఉన్నారు. అలాంటి వారికి పింఛను మొత్తాలను అందించడం ఆలస్యమవడంతో తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పింఛను అందుకునేందుకు కూలీలు, ఇతరులు అన్ని పనులు వదులుకుని రోజంతా సచివాలయాల వద్ద పడిగాపులు కాయాల్సి వచ్చింది.

**అవస్థలు పెట్టారు**



ప్రతి నెలా వలంటీర్ల సహకారంతో ఇళ్లవద్దనే పింఛన్ అందుకునేవాళ్లం. అయితే చంద్రబాబు వలంటీర్లను అడ్డుకోవడంతో అవస్థలు మొదలయ్యాయి. నాకు ఆరోగ్య పరిస్థితి అంతంతమాత్రంగానే ఉంది. ఉదయాన్నే పింఛను కోసం సచివాలయానికి వస్తే ఇంకా ప్రారంభించలేదు మధ్యాహ్నం రమ్మన్నారు. ఈ ఎండల్లో మళ్లీ సచివాలయానికి రావాలంటే చాలా కష్టం.

– పళణి, పింఛనుదారు, దొడ్డిపల్లె

**నడవలేకపోతున్నా..**



ఇంటివద్దకే వచ్చి పింఛను అందించే వలంటీర్లను పక్కన పెట్టడం దారుణం. మా లాంటి వాళ్ల ఉసురు చంద్రబాబుకు తగలక పోదు. వయసైన వాళ్లపైనా ఇలా కక్ష సాధిస్తారా? మేము అవస్థలు పడితే బాబు కళ్లు చల్లబడతాయా? నాకు ఎవరూ తోడు లేదు. ఈ ఎండలో సచివాలయానికి రావాలంటే ఇబ్బందిగా ఉంది. కాళ్లకు చెప్పులు లేకపోవడంతో నడవలేకపోతున్నాను.

– జయమ్మ, లబ్ధిదారు, మురుగానిపల్లె

**ఇంత దుర్మార్గమా..**



గత ఐదేళ్లుగా క్రమం తప్పకుండా వలంటీర్లు ఇంటి వద్దకే వచ్చి పింఛను అందించే వారు. ఎంతో ఆనందంగా ఉండేది. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. చంద్రబాబు స్వార్థ రాజకీయాల కోసం దుర్మార్గంగా వలంటీర్ల వ్యవస్థను అడ్డుకున్నారు. చంద్రబాబుకు మంచి బుద్ధి లేదు. కుర్చీ కోసం మమ్మల్ని ఇంతలా ఇబ్బందులు పెడతారని అనుకోలేదు.

– దుర్గమ్మ, పింఛనుదారు, చిత్తూరు

# నగరంలో 71 శాతం పింఛన్ల పంపిణీ

**చిత్తూరు అర్బన్:** చిత్తూరు నగరంలో సామాజిక పింఛన్ల పంపిణీ తొలిరోజున 71 శాతం మంది లబ్ధిదారులకు పంపిణీ చేశారు. మునిసిపల్ కమిషనర్ అరుణ ఉదయం బ్యాంకుల్లో నగదు విత్ డ్రా చేయడం, పింఛను సొమ్ములు పంపిణీ చేయడం పర్యవేక్షించారు. నగరంలోని అన్ని వార్డు సచివాలయాల్లో బుధవారం లబ్ధిదారులకు పింఛన్ అందజేశారు. సూపర్‌వైజర్ అధికారులు వారికి కేటాయించిన వార్డుల్లో ఉంటూ ఎలాంటి ఇబ్బంది లేకుండా లబ్ధిదారులకు పింఛన్ అందేలా పర్యవేక్షించాలని కమి షనర్ ఆదేశించారు. పలు సచివాలయాల్లో పర్యటించి పింఛను సొమ్ముల పంపిణీని పరిశీలించారు. దొడ్డిపల్లిలో లబ్ధిదారులకు పింఛన్ సొమ్మును అందించారు. లబ్ధిదారులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, వార్డు సచివాలయాల్లో లబ్ధిదారులందరికీ పింఛను అందజేస్తున్నట్లు వివరించారు. వార్డు కార్యదర్శులు సచివాలయాల్లో అందుబాటులో ఉంటారని లబ్ధిదారులు వారికి కేటాయించిన సమయంలో వచ్చి పింఛన్ సొమ్మును తీసుకోవచ్చని కమిషనర్ తెలిపారు. సచివాలయ కార్యదర్శులు వారికి కేటాయించిన క్లస్టర్ల వారీగా లబ్ధిదా రులకు పింఛన్ సొమ్ములు అందించాలని, లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడాలన్నా రు. వరుసలో ఉన్న అందరికీ పింఛను సొమ్ములు పంపిణీ చేయాలని, ఏ ఒక్కరూ వెనక్కి తిరిగి వెళ్లకూడదన్నారు. సాయంత్రం మరోసారి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వార్డు కార్యదర్శులు, సూపర్‌వైజర్ అధికారులతో పింఛన్ల పంపిణీపై కమిషనర్ సమీక్షించారు. కార్పొరేషన్ పరిధిలో మొత్తం 16,698 పింఛన్లకు గాను మొదటిరోజు 11,782 మందికి పింఛన్ల నగదు అందజేశారు. మిగిలిన పింఛన్లను గురువారం నాటికి పూర్తి చేయాలని కమిషనర్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో సీఎంఎం గోపి, ఇతర అధికారులు పాల్గొన్నారు.



పింఛన్ల పంపిణీ పర్యవేక్షిస్తున్న కమిషనర్ అరుణ

### పింఛన్ల పంపిణీ ప్రారంభం

**తవణంపల్లె:** మండలంలోని అన్ని సచివాలయాల్లో అవ్వాతాతలకు పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు ఎంపీడీఓ జి.వెంకటేశ్వర్లు తెలిపారు. మండలంలోని 32 పంచాయతీల్లో 9,917 మంది పింఛన్‌దారులకు రూ.2,73,89,000 నిధులు ప్రభుత్వం విడుదల చేసిందని పేర్కొన్నారు. బుధవారం మధ్యాహ్నం నుంచి సచివాలయాల్లో పంచాయతీ కార్యదర్శులు, వెల్ఫేర్ అసిస్టెంట్లు, సచివాలయ సిబ్బంది పింఛన్లు పంపిణీ చేశారు. సచివాలయాల వద్ద వేసవి దృష్ట్యా నీడ కోసం షామియానాలు, తాగునీరు ఏర్పాటు చేశారు.



పింఛన్లు పంపిణీ చేస్తున్న సిబ్బంది

# అభివృద్ధి పనుల పరిశీలన

**చిత్తూరు కార్పొరేషన్:** రైల్వేస్టేషన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులను గుంతకల్లు డివిజన్ డీఆర్‌ఎం వినీత్‌సింగ్ బుధవారం పరిశీలించారు. ప్లాట్‌ఫాం, లిఫ్ట్ పనులు, పార్శిల్ కేంద్రాన్ని పరిశీలించారు. అక్కడ ఉన్న విద్యార్థులతో వసతుల గురించి మాట్లాడారు. లిఫ్ట్ సౌకర్యం కల్పించాలని కోరగా త్వరలో అందుబాటులోకి వస్తుందన్నారు. చిత్తూరు–చెన్నైకు రైలు సదుపాయం కల్పించాలని స్మార్ట్ సిటీ సభ్యులు కోరారు. చిత్తూరు మీదుగా వెళ్లే ఆరు రైళ్లు ఇక్కడ ఆపడం లేదని సమస్యను తెలిపారు. పీసీఆర్ పాఠశాల, అంబేడ్కర్ భవన్ సమీపంలో రైల్వేబ్రిడ్జిలు ఏర్పాటు చేయాలని విన్నవించారు.

**అంతా గోప్యత :** చిత్తూరు రైల్వేస్టేషన్‌లో అమృత్ భారత్ కింద దాదాపు రూ.14 కోట్లతో ఆధునీకరణ పనులు జరుగుతున్నాయి. వీటి పర్యవేక్షించడానికి ఉన్నతాధికారులు వస్తుంటారు. వారు వచ్చినప్పుడు ముందస్తు సమాచారం ఎవరికీ ఇవ్వడం లేదు. ఇస్తే స్థానికంగా రైల్వేస్టేషన్‌లో నిర్వహణ లోపం, పలు రైళ్లు ఇక్కడ ఆగడం లేదని ఫిర్యాదులు చేస్తుంటారు. ఆ ఉద్దేశంతో సంబంధిత అధికారులు సమాచారం చెప్పడం లేదనే అపవాదు ఉంది.



పార్శిల్ సర్వీసును పరిశీలిస్తున్న డీఆర్‌ఎం వినీత్‌సింగ్

## రెండు వేర్వేరు ప్రాంతాల్లో రోడ్డు ప్రమాదాలు

**పూతలపట్టు:** రెండు వేర్వేరు ప్రాంతాల్లో రోడ్డు ప్రమాదాలు జరిగిన సంఘటన మండలంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు, మండలంలోని పాలకూరు జాతీయ రహదారిలో ఎదురెదురుగా వస్తున్న గుర్తుతెలియని కార్లు ఢీ కొన్నాయి. కారులోని డ్రైవరు తీవ్రంగా గాయపడినట్లు స్థానికులు గుర్తించారు. మరొక చోట రంగంపేట క్రాస్‌లోని తిరుపతి జాతీయరహదారిపై తిరుపతికి వెళుతున్న కారును వెనుక నుంచి గుర్తుతెలియని మరొక కారు ఢీ కొన్నాయి. కారులో వ్యక్తులకు స్వల్పగాయాలు కావడంతో దగ్గరలోని పి.కొత్తకోట సామాజిక ఆరోగ్య కేంద్రంలో చికిత్స నిమిత్తం తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# గర్భిణులు ఐరన్ మాత్రలు వాడాలి



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ ప్రియాంక



పరీక్షలు చేస్తున్న డాక్టర్ వినయ్‌కుమార్

**తవణంపల్లె:** గర్భిణులు ఐరన్ మాత్రలు తప్పక వాడాలని వైద్యాధికారి డాక్టర్ ప్రియాంక తెలిపారు. మండలంలోని దిగువ మాఘంలో బుధవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ ప్రియాంక రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. గర్భవతులు, బాలింతలు, బీపీ, సుగర్‌వ్యాధిగ్రస్తులకు పరీక్షలు చేయించి సూచనలు, సలహాలిచ్చారు. గర్భవతులు ప్రతి రోజు ఐరన్ మాత్రలు మింగాలన్నారు. దీని వల్ల రక్తహీనతను నివారించవచ్చని సూచించారు. మంచి పౌష్టికాహారం తీసుకోవాలని పేర్కొన్నారు.

**అరగొండలో ఫ్యామిలీ డాక్టర్**

మండలంలోని అరగొండలో బుధవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. వైద్యాధికారి డాక్టర్ వినయ్‌కుమార్ రోగులకు వైద్య పరీక్షలు చేయించారు. అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. ఎండలు తీవ్రంగా ఉండడంతో వడదెబ్బ తగలకుండా తగు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. గర్భవతులు మంచి పౌష్టికాహారం తీసుకోవాలని వివరించారు. ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలని సూచించాలన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ రాజామణి, ఆరోగ్య కార్యకర్తలు సుబ్రమణ్యం రెడ్డి, శ్రీనివాసులు, భార్గవి, అనసూయ, ఎంఎల్‌హెచ్‌పీలు హైమావతి, కుసుమ, డివైఈఓ విజయలక్ష్మి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.